# రెబల్స్ వశమైన సిరియా

## ముగిసిన అసద్ శకం.. ఐదున్నర దశాబ్దాల కుటుంబ పాలనకు తెర

- తిరుగుబాటుదారుల చేతుల్లోకి డమాస్కస్
- దేశం విడిచి పారిపోయిన అధ్యక్షుడు అసద్
- మిస్టరీగా ఆచూకీ.. ఆయన విమానాన్ని కూల్చేసినట్టు మీడియాలో కథనాలు
- పౌరుల సంబరాలు.. అధ్యక్ష భవనం లూటీ
- నిరంకుశ పాలన ముగిసిందన్న రెబల్స్

అసద్ తండ్రి విగ్రహం తలను వీధుల్లో ఈడ్చుకెళుతున్న ప్రజలు

డమాస్కస్, డిసెంబర్ 8: పశ్చిమాసియా దేశమైన సిరియాలో అసద్ శకం ముగిసింది. దేశం తిరుగుబాటుదారుల చేతుల్లోకి వెళ్లింది. ఆదివారం రాజధాని డమాస్కస్‌ను రెబల్స్ ఆక్రమించుకోవడంతో అధ్యక్షుడు బషర్ అల్ అసద్ దేశం విడిచి పారిపోయారు. ఆయన ఆచూకీ తెలియడం లేదు. అయితే అసద్ పారిపోతున్న విమానాన్ని రెబల్స్ కూల్చివేసినట్టు సామాజిక మాధ్యమంలో ప్రచారం జరిగింది. ఆయన ప్రయాణిస్తున్న ఐఎల్ 76 విమానాన్ని లెబనాన్ గగనతల పరిధిలో కూల్చివేసినట్టు పేర్కొంటున్నా, దానిని అధికారికంగా ఎవరూ ధ్రువీకరించ లేదు. కొత్త ప్రభుత్వం ఏర్పాటుకు తన పూర్తి సహకారం అందిస్తానని సిరియా ప్రధాని మహమ్మద్ ఘాజీ-జలాలి ప్రకటించారు. 'ఈ చీకటి కాలానికి ముగింపు పలుకుతున్నాం.. సిరియాలో కొత్త శకం ప్రారంభమైంది. విదేశాల్లో ఉన్న సిరియన్లు స్వేచ్ఛగా రావచ్చు' అని తిరుగుబాటుదారులు ప్రకటించారు. 55 ఏండ్ల అసద్ కుటుంబ పాలన ముగియడంతో పౌరులు వీధుల్లోకి వచ్చి సంబరాలు చేసుకున్నారు. అధ్యక్షుడు బషర్ అసద్ పదవీచ్యుతుడయ్యారని, ఖైదీలను విడుదల చేస్తున్నామని కొంతమంది వీడియో ప్రకటన విడుదల చేసినట్టు సిరియన్ స్టేట్ టెలివిజన్ తెలిపింది. తర్వాత కొద్ది సేపటికి అసద్ దేశాన్ని వదిలి గుర్తు తెలియని ప్రదేశానికి పారిపోయారని ప్రకటించింది. ఇప్పటి వరకు సిరియాకు సహాయం అందించిన రష్యా.. ఉక్రెయిన్ యుద్ధంతో తలమునకలై ఉండటం, ఇరాన్, హెజ్బొల్లాలు కూడా ఇజ్రాయెల్‌తో తలపడుతూ ఉండటం వల్ల సిరియాను పట్టించుకునే వారే కరవయ్యారు. దీంతో ఇదే అదనుగా ఇటీవల తిరుగుబాటుదారులు మళ్లీ విజృంభించడం ప్రారంభించారు. అబు మహ్మద్ అల్ జులానీ నేతృత్వంలోని హయాత్ తహరీర్ అల్ షమ్ (హెచ్‌టీఎస్) ఇటీవల తిరిగి తిరుగుబాటు ప్రారంభించి అసద్ పాలనకు ముగింపు పలికింది.

సిరియా ప్రభుత్వాన్ని కూలగొట్టాక నినాదాలు చేస్తున్న తిరుగుబాటుదారులు

అధ్యక్షుడి భవనంలోని షాండ్లియర్‌ను లూటీ చేస్తున్న ఓ పౌరుడు

### అధ్యక్ష భవనం లూటీ

అంతర్యుద్ధం ఉన్నా, 14 ఏండ్ల పాటు నిరంకుశ పాలన సాగించిన అసద్ పదవి నుంచి దిగిపోయిన విషయాన్ని ప్రజలు తొలుత నమ్మలేకపోయారు. కొద్ది సేపటికి రాజధాని అంతటా సంబరాలతో నిండిపోయింది. మసీదులలో ప్రార్థనలతో పాటు, ఉమయ్యద్ స్క్వేర్‌లో వేలాది మంది సంబరాలు జరుపుకున్నారు. అసద్ వ్యతిరేక నినాదాలు చేస్తూ, జాతీయ జెండాలు చేతబట్టి సంబరాలు చేసుకున్నారు. కొందరు అధ్యక్షుడి భవనంలోకి ప్రవేశించి ఖరీదైన సామగ్రిని అపహరించుకుపోయారు. అసద్ తండ్రి విగ్రహంతో పాటు ఆస్తులు, అధికార చిహ్నాలను వారు ధ్వంసం చేశారు.

### 14 ఏండ్ల పాటు నిరంకుశ పాలన

సిరియా అధ్యక్షుడు అసద్ వృత్తి రీత్యా డాక్టర్. ఆయనకు రాజకీయాలపై పెద్దగా ఆసక్తి లేదు. ఆయన పెద్ద సోదరుడు బషీర్ రాజకీయ వారసుడిగా కొనసాగుతారని అనుకున్నారు. అయితే 1994లో ఆయన రోడ్డు ప్రమాదంలో మరణించడంతో అసద్ స్వదేశానికి వచ్చారు. 2000లో ఆయన తండ్రి హఫెజ్ అల్ అసద్ మరణించడంతో అసద్‌ను అధ్యక్షుడిగా ప్రకటించారు. వాస్తవానికి అధ్యక్షుడిగా ఎంపికవ్వడానికి 40 ఏళ్ల వయసుండాలి. అయితే అసద్‌కు అప్పటికీ 34 ఏండ్లే కావడంతో చట్టాన్ని సడలించారు. అసద్‌కు 2011 మార్చి నుంచి దేశంలో వ్యతిరేకత ప్రారంభమైంది. దీంతో అసమ్మతి గళాలను అణచివేయడానికి ఆయన తండ్రి బాటలో క్రూరమైన విధానాలను అనుసరించారు. ఇది అంతర్యుద్ధానికి దారితీసింది. సిరియా ప్రభుత్వంలో పౌరులపై జరుగుతున్న హింస, చట్టవిరుద్ధ హత్యలు, ప్రభుత్వం నిర్వహిస్తున్న నిర్బంధ కేంద్రాలపై అంతర్జాతీయ మానవ హక్కుల సంఘాలు అభ్యంతరం వ్యక్తం చేశాయి. యుద్ధం కారణంగా ఐదు లక్షల మంది మరణించగా, 23 మిలియన్ల జనాభాలో సగం మంది నిరాశ్రయులయ్యారు.

### అధికారం కోల్పోయే స్థితికి వచ్చి..

2015లో తిరుగుబాటుదారుల దూకుడుతో అసద్ అధికారం కోల్పోయే పరిస్థితికి వచ్చారు. అయితే ఇరాన్‌తో పాటు లెబనాన్‌కు చెందిన హెజ్బొల్లా, రష్యా వాయుసేన రంగంలోకి దిగి తిరుగుబాటుదారులపై దాడులు చేయడంతో వారు వెనక్కి తగ్గారు. తర్వాత ఐసిస్ ప్రాబల్యం పెరిగింది. దీనిపై అమెరికా స్పందించి వాటిని తుడిచిపెట్టేసింది. తర్వాత వేర్పాటు వాదులు తిరిగి పుంజుకుని దేశాన్ని ఆక్రమించుకోవడంతో 60 శాతం సిరియా భూభాగాన్ని మాత్రమే అసద్ పాలించారు. సొంత ప్రజలపైనే రసాయన దాడులు, సిలిండర్ దాడులు చేసిన అపకీర్తిని అసద్ మూటకట్టుకున్నారు. ఆయన ఆర్థిక విధానాలు దేశానికి నష్టం కలిగించాయి. ద్రవ్యోల్బణం పెరిగింది. ప్రజాస్వామ్యం కోసం 2011లోనే ఉద్యమాలు ప్రారంభమయ్యాయి. అయితే వీటిని బషర్ ఉక్కుపాదంతో అణచివేశారు.

### ఎవరీ అల్ జులానీ?

హయాత్ తహరీర్ అల్ షమ్ (హెచ్‌టీఎస్) నేతృత్వంలోని తిరుగుబాటు దళాలకు సారథ్యం వహించి అసద్‌ను గద్దెదించిన అబు మహ్మద్ అల్ జులానీపై ఇప్పుడు అందరి దృష్టి పడింది. అల్‌ఖైదాకు అనుబంధంగా పనిచేసే హెచ్‌టీఎస్‌కు నేతృత్వం వహిస్తున్న జులానీ తలపై అమెరికా 10 మిలియన్ డాలర్ల రివార్డు ప్రకటించింది. అయితే జులానీ అసలు పేరేంటి, అతను ఏ ప్రాంతం వాడన్నది ఇప్పటికీ మిస్టరీయే. జులానీ 2003లో అల్ ఖైదాలో చేరాడు. 2016లో సిరియాలోని ఐఎస్ క్యాడర్‌ను బలోపేతం చేసేందుకు ఆయనను సిరియాకు పంపారు. అక్కడ ఆయన ఐసిస్‌తో రహస్య సంబంధాలున్న నుస్రా ఫ్రంట్‌కు కమాండర్‌గా ఎదిగాడు. తర్వాత తాను అంతర్జాతీయ ఉగ్రవాద ముఠా నుంచి వేరుపడినట్టు ప్రకటించాడు. హెచ్‌టీఎస్ ఆవిర్భావానికి వీలుగా 2017లో తన ఫైటర్ గ్రూప్‌ను మిగిలిన సిరియా రెబల్ గ్రూప్‌లతో విలీనం చేస్తున్నట్టు చెప్పాడు. అనంతరం ఈ హెచ్‌టీఎస్ గ్రూపే సిరియాలో ఒక్కో నగరాన్ని ఆక్రమిస్తూ, చివరకు అసద్‌ను దేశం విడిచి పారిపోయేలా చేసింది.

### సిరియా భవిష్యత్తు ఏంటి?

సిరియా ప్రస్తుత పరిస్థితి పెనం మీద నుంచి పొయ్యిలో పడ్డ చందంగా మారింది. ఇప్పటివరకు నిరంకుశ పాలనలో నలిగిపోయిన ప్రజలు భవిష్యత్తులో అతివాదుల పాలన ఎలా ఉంటుందోనని ఆందోళన చెందుతున్నారు. అసద్ పాలన అంతమైనంత మాత్రాన అల్‌ఖైదాతో సంబంధాలు ఉన్న హెచ్‌టీఎస్‌తో ఇక్కడ శాంతి సౌభాగ్యాలు వెల్లివిరుస్తాయని ఎవరూ ఆశించడం లేదు. అంతర్యుద్ధం కారణంగా, పలు నగరాలు, పట్టణాలు, గ్రామాలు దాదాపు 70 శాతం శిథిలమయ్యాయి. వాటిని పునర్నిర్మించాలంటే వేల కోట్లు అవసరం. కొత్తగా అధికారంలోకి వచ్చే వారు జాతుల ఘర్షణను నివారించాల్సి ఉంది. అతివాదులు అధికారంలోకి వస్తే పశ్చిమ దేశాలు అంతగా సహకరించవు. అరబ్ దేశాలతో పాటు అభివృద్ధి చెందిన దేశాలు కూడా సిరియాకు చేయూతనివ్వాలి. అయితే ఇది అంత సులభంగా జరుగుతుందని భావించలేం.

## ముడుపులు ముడితేనే పనులు!

- దేశంలో పెచ్చరిల్లిన అవినీతి
- లంచాలు ఇచ్చినట్టు 66 శాతం వ్యాపార సంస్థల ప్రకటన
- లోకల్ సర్కిల్స్ సర్వేలో వెల్లడి



న్యూఢిల్లీ: గడచిన ఏడాది కాలంలో తాము ముడుపులు చెల్లించినట్లు దాదాపు 66 శాతం వ్యాపార సంస్థలు అంగీకరించినట్లు ఆన్‌లైన్ ప్లాట్‌ఫామ్ లోకల్ సర్కిల్స్ ఆదివారం ఒక నివేదికలో తెలిపింది. 159 జిల్లాల వ్యాప్తంగా నిర్వహించిన సర్వేలో 18,000 స్పందనలు వచ్చినట్లు పేర్కొంది. తాము బలవంతంగా ముడుపులు చెల్లించినట్లు 54 శాతం సంస్థలు తెలియచేయగా, తమ పని వేగవంతం అయ్యేందుకు తామే స్వచ్ఛందంగా ముడుపులు చెల్లించినట్లు 46 శాతం సంస్థలు వెల్లడించినట్లు నివేదిక తెలిపింది. ప్రభుత్వ శాఖల నుంచి పర్మిట్లు, అనుమతులు, లైసెన్సుల ప్రతులు, ఆస్తులకు సంబంధించిన ఏ వ్యవహారాలకైనా ముడుపులు చెల్లించడం ఆనవాయితీగా మారిందని అనేక వ్యాపార సంస్థలు భావిస్తున్నాయి. అనేక కార్యాలయాలలో కంప్యూటరీకరణ జరిగినప్పటికీ సీసీటీవీలకు దూరంగా రహస్యంగా వ్యాపార సంస్థల నుంచి ముడుపులు పుచ్చుకోవడం కొనసాగుతూనే ఉందని నివేదిక పేర్కొన్నది. మార్కెటింగ్ రంగంలో ఈ-ప్రాక్యూర్‌మెంట్ వంటి కొత్త విధానాలు అవినీతిని తగ్గించడానికి సరైన అడుగులే అయినప్పటికీ సరఫరాదారుగా అర్హత సాధించడం, టెండర్ ప్రక్రియలో అక్రమాలు, కంప్లీషన్ సర్టిఫికెట్లు, ప్రభుత్వం నుంచి చెల్లింపులు వంటి విషయాలలో అవినీతి అంతం కాలేదని తెలిపింది. ఈ ఏడాది మే 22 నుంచి నవంబర్ 30 మధ్య ఈ సర్వే జరిగింది. న్యాయ, తూనికలు, ఆహార, ఔషధ, ఆరోగ్య తదితర శాఖలకు చెందిన అధికారులకు ఈ ముడుపులలో 75 శాతం వెళ్లినట్లు సర్వేలో తేలింది. జీఎస్‌టీ, కాలుష్య నియంత్రణ, మున్సిపల్ కార్పొరేషన్, విద్యుత్తు శాఖ అధికారులకు సైతం ముడుపులు చెల్లించినట్లు అనేక వ్యాపార సంస్థలు తెలియచేశాయి.

- 66 శాతం- గడచిన 12 నెలల్లో వివిధ ప్రభుత్వ శాఖలకు ముడుపులు ముట్టచెప్పినట్లు తెలిపిన వ్యాపార సంస్థలు
- 54 శాతం- బలవంతంగా ముడుపులు చెల్లించాల్సి వచ్చిందని చెప్పిన సంస్థలు
- 46 శాతం- పని త్వరగా పూర్తయ్యేందుకు స్వచ్ఛందంగా ముడుపులు ఇచ్చినట్టు తెలిపిన సంస్థలు
- 19 శాతం- లంచం చెల్లించాల్సిన అవసరం రాలేదని చెప్పిన సంస్థలు
- 16 శాతం- ముడుపులు చెల్లించకుండానే తమ పని పూర్తి చేసుకున్నామని తెలిపిన సంస్థలు

## జనవరి నుంచి కార్లు ప్రియం

### ధరలు పెంచనున్న ఆటోమొబైల్ కంపెనీలు

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: కొత్త కారు కొనాలనుకుంటున్నారా? అయితే వెంటనే త్వరపడండి. ఈ నెలలోనే కొనేయండి. లేకుంటే మీ జేబుకు చిల్లు పడటం ఖాయం. త్వరలో హ్యాచ్‌బ్యాక్ మొదలుకొని హై-ఎండ్ లగ్జరీ మోడళ్ల వరకు దాదాపు అన్ని రకాల కార్ల ధరలను పెంచబోతున్నట్టు ఆటోమొబైల్ కంపెనీలు ప్రకటించాయి. జనవరి నుంచి కొత్త ధరలు అమల్లోకి వస్తాయని స్పష్టం చేశాయి. ఉత్పత్తి వ్యయం, నిర్వహణ ఖర్చులు పెరగడమే ఇందుకు కారణమని తెలిపాయి. దేశీయ ఆటోమొబైల్ దిగ్గజం మారుతి సుజుకీ తన ఎంట్రీ లెవల్ కారు 'ఆల్టో కే-10' మొదలుకొని మల్టీ యుటిలిటీ వెహికల్ 'ఇన్విక్టో' వరకు అన్ని రకాల మోడళ్ల ధరలను 4% మేరకు పెంచనున్నట్టు ప్రకటించగా.. హ్యుందాయ్ కంపెనీ తమ కార్ల ధరలను రూ.25 వేల వరకు పెంచనున్నట్టు వెల్లడించింది. అలాగే జనవరి నుంచి మహీంద్రా అండ్ మహీంద్రా, జేఎస్‌డబ్ల్యూ ఎంజీ, మెర్సిడెస్ బెంజ్, ఆడీ, బీఎండబ్ల్యూ కార్ల ధరలను 3% మేరకు పెంచనున్నట్టు ఆయా సంస్థలు తెలిపాయి.

## శీతాకాల చార్‌ధామ్ యాత్రకు శ్రీకారం

### ఇకపై ఏడాదంతా దర్శనానికి అవకాశం

న్యూఢిల్లీ: ఆధ్యాత్మిక పర్యాటకం, ఆర్థిక వృద్ధిని పెంపొందించే లక్ష్యంతో శీతాకాల చార్‌ధామ్ యాత్రను ఉత్తరాఖండ్ సీఎం పుష్కర్ సింగ్ ధామి ఆదివారం ప్రారంభించారు. ఈ చారిత్రక ఘట్టానికి కేదారేశ్వరుడి శీతాకాల విడిది అయిన ఉఖీమఠ్‌లోని ఓంకారేశ్వర ఆలయం వేదికైంది. సంప్రదాయ ప్రార్థనలు, క్రతువులతో కూడిన ప్రారంభోత్సవంతో అధికారికంగా చార్‌ధామ్ యాత్ర ఏడాది పొడవునా యాత్రికులకు అందుబాటులోకి వచ్చింది. ఈ సందర్భంగా సీఎం ధామి మాట్లాడుతూ ఉత్తరాఖండ్‌ను ఏడాది పొడవునా యాత్రికుల గమ్యస్థానంగా తీర్చిదిద్దడంలో శీతాకాల చార్‌ధామ్ యాత్ర గొప్ప ముందడుగని అన్నారు. మంచు ఎక్కువగా కురుస్తుందనే కారణంతో సంప్రదాయం ప్రకారం చార్‌ధామ్ యాత్రను శీతాకాలంలో నిలిపివేస్తారు. ఇక నుంచి ఆయా దేవతా మూర్తులు శీతాకాలంలో కొలువుండే ఆలయాలకు భక్తులు చార్‌ధామ్ యాత్ర చేయవచ్చు.

## 2,500 కిలోమీటర్లు చేజ్ చేసి

### హైదరాబాద్‌లో నిందితుడిని పట్టుకున్న ఢిల్లీ పోలీసులు

న్యూఢిల్లీ: భారతీయ పౌరులను అక్రమంగా విదేశాలకు తరలించి వారి చేత సైబర్ నేరాలకు పాల్పడే నకిలీ కాల్ సెంటర్లలో బలవంతంగా పనిచేయిస్తున్న ఒక ముఠాకు చెందిన ప్రధాన సూత్రధారిని దాదాపు 2,500 కిలోమీటర్లు వెంటాడి ఢిల్లీ పోలీసులు హైదరాబాద్‌లో అరెస్టు చేశారు. ప్రధాన నిందితుడైన కమ్రాన్ హైదర్ అలియాస్ జైదీని నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో అరెస్టు చేసినట్లు ఢిల్లీ పోలీసు స్పెషల్ సెల్ డీసీపీ మనోజ్ ఆదివారం తెలిపారు. అతడి ఆచూకీ తెలిపిన వారికి రూ. 2 లక్షల బహుమానం ఇస్తామని జాతీయ దర్యాప్తు సంస్థ(ఎన్ఐఏ) గతంలోనే ప్రకటించిందని, అదే అతడిని పట్టించిందని ఆయన చెప్పారు. ప్రకాశ్ లఖావత్ అనే వ్యక్తి ఇచ్చిన ఫిర్యాదు మేరకు మే 27న న్యూ ఫ్రెండ్స్ కాలనీ పోలీసు స్టేషన్‌లో కేసు నమోదైంది. ఉద్యోగం కోసం వెదుకుతున్న తనకు న్యూఢిల్లీలో ఉన్న అలీ ఇంటర్నేషనల్ సర్వీసు అనే కన్సల్టెన్సీ సంస్థ గురించి తెలిసిందని లఖావత్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. థాయ్‌లాండ్, లావోస్‌లో తనకు ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి తనను థాయ్‌లాండ్ పంపించారని ఆయన చెప్పారు. అక్కడకు చేరుకున్న తర్వాత తన పాస్‌పోర్టును లాక్కుని, ఆన్‌లైన్‌లో భారతీయులను స్కామ్ చేసే ఒక చైనీస్ కంపెనీలో పనిచేయాలంటూ ఒత్తిడి తెచ్చారని తెలిపారు. ఈ కేసును ఎన్ఐఏకి బదిలీ చేయడంతో దర్యాప్తు చేపట్టిన కేంద్ర సంస్థ ఈ కేసులో ప్రధాన కుట్రదారులుగా మంజూర్ ఆలం, సాహిల్, ఆశిష్, పవన్ యాదవ్, హైదర్‌లను గుర్తించింది. యూరోపియన్, అమెరికన్ పౌరులను లక్ష్యంగా చేసుకుని సైబర్ స్కామ్‌లకు పాల్పడేందుకు నిరుద్యోగ భారతీయ యువజనులను లావోస్‌లోని గోల్డెన్ ట్రయాంగిల్ రీజియన్‌కు ఈ ముఠా సభ్యులు తరలిస్తున్నారని డీసీపీ తెలిపారు. పరారీలో ఉన్న ప్రధాన నిందితుడు కమ్రాన్ హైదర్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు వేట సాగించారని, థాయ్‌లాండ్, లావోస్ దేశాలకు పారిపోవడానికి కూడా అతను ప్రయత్నించాడని ఆయన చెప్పారు. రాష్ట్రాలు మారుస్తూ తప్పించుకు తిరుగుతున్న హైదర్‌ను పట్టుకునేందుకు పోలీసు బృందాలు మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్‌లో గాలింపు జరిపాయని డీసీపీ చెప్పారు. చివరకు హైదరాబాద్‌లో ఉన్నట్లు సమాచారం అందడంతో స్పెషల్ సెల్‌కు చెందిన రెండు బృందాలు హైదరాబాద్ చేరుకున్నాయని ఆయన తెలిపారు. అవిశ్రాంతంగా 2,500 కిలోమీటర్లు వేటాడిన పోలీసు బృందాలు ఎట్టకేలకు డిసెంబర్ 7న హైదరాబాద్‌లోని నాంపల్లి రైల్వే స్టేషన్ సమీపంలో హైదర్‌ను అరెస్టు చేశాయని ఆయన చెప్పారు.

## కెనడాలో మరో భారతీయుడి హత్య

### వారం వ్యవధిలో రెండో ఘటన

న్యూఢిల్లీ: కెనడాలో భారతీయులపై దాడులు పెరిగిపోతున్నాయి. ఈ నెల 1న బిజినెస్ మేనేజ్‌మెంట్ విద్యార్థి గురసిస్ సింగ్ (22)ను రూమ్‌మేట్ హత్య చేయగా, ఈ నెల 6న సెక్యూరిటీ గార్డ్ హర్షణ్‌దీప్ సింగ్ (20)ని కాల్చి చంపేశారు. హర్షణ్‌దీప్ కేసులో ఇద్దర్ని అరెస్ట్ చేసినట్లు ఎడ్మంటన్ పోలీసులు ప్రకటించారు. శుక్రవారం రాత్రి 12.30 గంటల సమయంలో తమకు సమాచారం అందిన వెంటనే అపార్ట్‌మెంట్‌కు వచ్చి చూశామని, స్పృహలేని స్థితిలో ఉన్న హర్షణ్‌దీప్‌ను దవాఖానకు తరలించామని, ఆయన మరణించినట్లు వైద్యులు ప్రకటించారని పోలీసులు చెప్పారు. సీసీటీవీ ఫుటేజ్‌లో ముగ్గురు దుండగులు హర్షణ్‌దీప్‌పై దాడి చేసినట్లు కనిపించింది.

## టీ-బిస్కెట్లిచ్చి.. పూలు జల్లి..

- ఆపై బాష్ప వాయు గోళాలు, జల ఫిరంగులతో దాడి చేసి..
- రైతుల ఆందోళనలో హర్యానా పోలీసుల డ్రామా
- చలో ఢిల్లీ పాదయాత్ర చేపట్టిన అన్నదాతలపై దాష్టీకం
- పలువురికి గాయాలు.. తాత్కాలికంగా యాత్ర నిలిపివేత

న్యూఢిల్లీ, డిసెంబర్ 8: తమ డిమాండ్ల సాధనకు రైతులు ఆదివారం ఢిల్లీకి కొనసాగించిన పాదయాత్రను పోలీసులు మరోసారి భగ్నం చేశారు. పంజాబ్-హర్యానా సరిహద్దు శంభు వద్ద శుక్రవారం రైతులు ప్రారంభించిన పాదయాత్రపై పోలీసులు బాష్ప వాయు గోళాలు ప్రయోగించడంతో పలువురు గాయపడిన విషయం తెలిసిందే. అయితే ఆదివారం నాటి ఆందోళనలో హర్యానా పోలీసులు చాలా నాటకీయంగా వ్యవహరించారు. 101 మంది రైతులు తిరిగి యాత్ర ప్రారంభించగా, వారికి పోలీసులు టీ, బిస్కెట్లు పంచి ఆశ్చర్యపరిచారు. అంతేకాకుండా వారిపై పూల రేకలను కూడా చల్లడంతో రైతులు విస్తుపోయారు. రైతులు ఢిల్లీ వైపు వెళ్లడానికి ప్రయత్నించగా, అప్పటి వరకు తాము ఆడిన డ్రామాకు తెరదించిన పోలీసులు వారిని అడ్డుకోవడం ప్రారంభించారు. రైతులను చెదరగొట్టడానికి నిర్దాక్షిణ్యంగా బాష్పవాయు గోళాలు, జల ఫిరంగులు ప్రయోగించారు. ఈ ఘటనలో 8 మంది రైతులు గాయపడగా, ఒకరిని దవాఖానకు తరలించినట్టు రైతు నేత శర్వణ్ సింగ్ పాంధేర్ తెలిపారు. రైతు పాదయాత్రను తాత్కాలికంగా నిలిపివేసినట్టు ఆయన ప్రకటించారు. తదుపరి కార్యాచరణను సోమవారం నిర్ణయిస్తామని చెప్పారు.

### నోయిడా జైలులో రైతుల నిరాహార దీక్ష

నోయిడాలో ఆందోళన చేయడంతో అరెస్టయి జైలులో ఉన్న రైతులు తమ డిమాండ్ల సాధనకు జైలులో నిరాహార దీక్ష ప్రారంభించినట్టు సంయుక్త కిసాన్ మోర్చా ఆదివారం తెలిపింది. ప్రస్తుతం గౌతమబుద్ధ నగర్ జైలులో ఉన్న రైతులు చాలాకాలంగా పెండింగ్‌లో ఉన్న డిమాండ్ల సాధనకు ఈ దీక్ష చేపట్టారని పేర్కొంది. ఆరోగ్యం దెబ్బతినే ప్రమాదం ఉన్నా డిమాండ్లు నెరవేరే వరకు దీక్ష చేస్తామని రైతులు స్పష్టం చేశారన్నారు.

## సిరియాలో గోలన్ హైట్స్‌ను స్వాధీనం చేసుకున్న ఇజ్రాయెల్

టెల్ అవీవ్: ఒక పక్క సిరియా తిరుగుబాటుదారులు ఆ దేశ అధ్యక్షుడిని వెళ్లగొట్టి దేశాన్ని ఆక్రమించుకోగా, మరో పక్క సిరియా దేశం ఆధీనంలో ఉన్న గోలన్ హైట్స్ ప్రాంతాన్ని ఇజ్రాయెల్ స్వాధీనం చేసుకుంది. ఐదు గ్రామాలున్న ఇది ఇజ్రాయెల్ వ్యూహాత్మక ప్రాంతానికి దగ్గరగా ఉంది. గోలన్ హైట్స్‌లోని బఫర్‌జోన్‌ను స్వాధీనం చేసుకోవాలని ఇజ్రాయెల్ ప్రధాని నెతన్యాహూ తన సైన్యాన్ని ఆదేశించారు. 1967లో జరిగిన యుద్ధంలో ఇజ్రాయెల్ గోలన్ హైట్స్‌ను స్వాధీనం చేసుకుని తనలో కలిపేసుకుంది. ఒక్క అమెరికా తప్ప ప్రపంచంలోని దేశాలన్నీ దానిని అన్యాయంగా ఆక్రమించాయని ఆరోపించాయి. తర్వాత దాని స్వాధీనానికి సిరియా చేసిన ప్రయత్నాలు ఫలించలేదు. దీంతో గోలన్ హైట్స్‌పై 1974లో సిరియాతో ఇజ్రాయెల్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని కుదుర్చుకుని బఫర్ జోన్‌గా ప్రకటించాయి. అయితే తాజాగా సిరియా అధ్యక్షుడి నిష్క్రమణతో ఈ ఒప్పందం రద్దయిందని ఆదివారం నెతన్యాహూ ప్రకటించారు. దానిని ఇజ్రాయెల్ స్వాధీనానికి వీలుగా ఇప్పటికే ఆ ప్రాంతాన్ని సిరియా సైనికులు వదిలి వెళ్లారన్నారు.

## నాటో నుంచి వైదొలుగుతాం!

### అమెరికా కాబోయే అధ్యక్షుడు ట్రంప్

వాషింగ్టన్, డిసెంబర్ 8: రష్యా-ఉక్రెయిన్ తక్షణం కాల్పుల విరమణ ప్రకటించాలని అమెరికా తదుపరి అధ్యక్షుడు ట్రంప్ పిలుపునిచ్చారు. నాటో నుంచి అమెరికాను బయటకు తీసుకురావడానికి తాను సిద్ధమేనని హెచ్చరించారు. ట్రంప్ శనివారం పారిస్‌లో ఫ్రాన్స్ అధ్యక్షుడు ఎమ్మాన్యుయేల్ మాక్రాన్, ఉక్రెయిన్ అధ్యక్షుడు జెలెన్‌స్కీలతో సమావేశమయ్యారు. అనంతరం ఆదివారం ఆయన సోషల్ మీడియా ప్లాట్‌ఫాం ట్రూత్ సోషల్‌లో ఇచ్చిన పోస్ట్‌లో, 1,000 రోజుల నుంచి జరుగుతున్న రష్యా-ఉక్రెయిన్ యుద్ధానికి తక్షణమే ముగింపు పలకాల్సిన్నారు. దీనిపై రష్యా స్పందిస్తూ, చర్చలకు సిద్ధమేనని తెలిపింది. కానీ జెలెన్‌స్కీ స్పందిస్తూ, ఏ ఒప్పందమైనా శాశ్వత శాంతికి దారి తీసేవిధంగా ఉండాలన్నారు.

## చెప్పులకు రూ.237 కోట్లు!

మినియాపోలిస్: రెండు దశాబ్దాల క్రితం ఒక మ్యూజియం నుంచి చోరీకి గురైన అలనాటి అమెరికన్ నటి జూడీ గార్లాండ్‌కు చెందిన కెంపులు పొదిగిన పాదరక్షలు శనివారం జరిగిన ఆన్‌లైన్ వేలంలో రికార్డు స్థాయిలో 28 మిలియన్ డాలర్లకు (రూ.237 కోట్లు) అమ్ముడయ్యాయి. 1939లో విడుదలై ఘన విజయం సాధించిన ది విజార్డ్ ఆఫ్ ఓజ్ అనే అమెరికన్ చిత్రంలో ఈ పాదరక్షలను జూడీ గార్లాండ్ ధరించి నటించారు. 1969లో గార్లాండ్ మరణించగా తదనంతర కాలంలో ఈ విలువైన పాదరక్షలను ఆమె సొంత ఊరు గ్రాండ్ రాపిడ్స్ పట్టణంలోని జూడీ గార్లాండ్ మ్యూజియంలో భద్రపరిచారు. అయితే 2005లో టెర్నీ జాన్ మార్టిన్ అనే వ్యక్తి వాటిని తస్కరించాడు. 2018లో మార్టిన్ నుంచి ఈ చెప్పులను ఎఫ్‌బీఐ స్వాధీనం చేసుకుంది.

## పెండ్లితో ఒక్కటైన శతాధిక వృద్ధులు

న్యూఢిల్లీ: అమెరికన్ శతాధిక వృద్ధులు బెర్నీ లిట్‌మన్ (100), మర్జోరీ ఫిటర్‌మన్ (102) ప్రేమకు వయసు అడ్డుకాదని నిరూపించి, గిన్నిస్ రికార్డు సృష్టించారు. వీరిద్దరూ దాదాపు పదేళ్ల నుంచి ప్రేమించుకుంటూ మేలో పెండ్లి చేసుకున్నారు. దీంతో ప్రపంచంలో అత్యధిక వయసు గల నవ దంపతులుగా ఘనత సాధించారని గిన్నిస్ వరల్డ్ రికార్డ్స్ ప్రకటించింది. బెర్నీ, మర్జోరీలకు గతంలో వేర్వేరుగా వివాహాలు జరిగాయి. వారి జీవిత భాగస్వాములు మరణించారు. అనంతరం వీరిద్దరూ ఫిలడెల్ఫియాలో ఉన్న ఓ వృద్ధాశ్రమంలో చేరారు. అక్కడ కాస్ట్యూమ్ పార్టీలో వీరి మధ్య ప్రేమ చిగురించింది. ప్రేమ, సాహచర్యం, సంతోషాలను పొందడానికి వయసుతో పని లేదని వీరిద్దరూ నిరూపించారు. అంతకుముందు ఇద్దరు శతాధిక వృద్ధులు పెండ్లి చేసుకుని సృష్టించిన రికార్డును వీరు చెరిపేశారు.

- కేంద్ర మంత్రుల ర్యాంప్ వాక్

గువాహటి: ఢిల్లీ ప్రగతి మైదాన్‌లోని భారత్ మండపంలో జరుగుతున్న అష్టలక్ష్మి మహోత్సవ్ ఫ్యాషన్ షోలో కేంద్రమంత్రి జ్యోతిరాదిత్య సింధియా, సహాయమంత్రి సుకాంత మజుందార్ ర్యాంప్‌వాక్ చేశారు. 8 ఈశాన్య రాష్ట్రాల సాంస్కృతిక, సామాజిక, ఆర్థిక స్వరూపాన్ని ప్రదర్శించే ఈ అష్టలక్ష్మి మహోత్సవ్ పండుగను ప్రధాని మోదీ ఈ నెల 6న ప్రారంభించారు. ఇందులో భాగంగా ఆదివారం నిర్వహించిన ఫ్యాషన్ షోలో కేంద్రమంత్రులు ర్యాంప్ వాక్ చేసి అందరినీ ఆకట్టుకున్నారు.

## ప్రపంచ సంపన్న బిచ్చగాడు మనోడే!

### రూ.7.5 కోట్లకు అధిపతి భరత్ జైన్

ముంబై: ప్రపంచంలోనే అత్యంత సంపన్న బిచ్చగాడిగా భరత్ జైన్ వార్తల్లో నిలిచాడు. 'ఎకనమిక్ టైమ్స్' నివేదిక ప్రకారం, ఆర్థిక ఇబ్బందుల వల్ల చదువును అర్ధాంతరంగా ఆపేసిన భరత్ బిచ్చమెత్తుకోవడం ప్రారంభించాడు. తన పిల్లలు తన మాదిరిగా కష్టాలు పడకూడదని గట్టిగా నిర్ణయించుకున్నాడు. ఇప్పుడు ఆయన నెల సంపాదన రూ.60,000 నుంచి రూ.75,000 ఉంటుంది. ఆయనకు ముంబైలో రూ.1.4 కోట్ల విలువైన రెండు ఫ్లాట్